# బడి గంటకు అమావాస్య ఎఫెక్ట్



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



↑ ఓ ప్రైవేటు స్కూల్ వద్ద చిన్నారులకు స్వాగతం పలుకుతున్న ట్రాఫిక్ పోలీస్

**గ్రామీణ ప్రాంతాలలో ఖాళీగా దర్శనమిచ్చిన క్లాస్ రూములు**

**చాక్లెట్లతో చిన్నారులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు**

**సర్కారు స్కూళ్లలో 1.25 లక్షల మందికి 85 వేల మంది.. 'ప్రైవేటు'లో 5 లక్షల మందికి 3.5 లక్షల మంది హాజరు**

**ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కిట్ల పంపిణీ**

**కొత్త పుస్తకాల సందడి.. సరికొత్త హుషారుతో బడిబాట పట్టాల్సిన విద్యార్థులను అమావాస్య సెంటిమెంట్ అడ్డుకుంది. సుదీర్ఘ వేసవి సెలవుల తర్వాత సోమవారం స్కూళ్లు తెరుచుకున్నా.. క్లాస్ రూములు మాత్రం సగం ఖాళీగానే దర్శనమిచ్చాయి. అమావాస్య రోజున చదువులు ప్రారంభించడం మంచిది కాదన్న సంప్రదాయ భావనతో తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపకపోవడంతో, రంగారెడ్డి జిల్లాలో తొలి రోజు హాజరు గణనీయంగా తగ్గిపోయింది.**



ఆమనగల్లు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రాకపోవడంతో ఖాళీగా కనిపించిన ఉపాధ్యాయులు

**రంగారెడ్డి అర్బన్, జూన్ 15, ప్రభాతవార్త:** దాదాపు 50 రోజులకు పైగా వేసవి సెలవుల అనంతరం రంగారెడ్డి జిల్లాలో సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ, తొలి రోజు విద్యార్థుల హాజరు ఆశించిన స్థాయిలో నమోదు కాలేదు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 5.5 లక్షల నుంచి 6 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ అంచనా వేయగా, మొదటి రోజు సగటున 40 నుంచి 50 శాతం మంది మాత్రమే బడికి హాజరయ్యారు. దీంతో కొత్త విద్యాసంవత్సరం ఆరంభం ఊహించినంత సందడిగా కనిపించలేదు. విద్యాశాఖ వర్గాల కథనం ప్రకారం... ప్రభుత్వ పాఠశాలల్లోని 1.10 లక్షల నుంచి 1.25 లక్షల మంది విద్యార్థులకు గాను సుమారు 70 వేల నుంచి 85 వేల మంది మాత్రమే వచ్చారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 4.50 లక్షల నుంచి 5 లక్షల మంది విద్యార్థులలో కేవలం 3 లక్షల నుంచి 3.5 లక్షల మంది మాత్రమే హాజరయ్యారు.

కొత్త విద్యాసంవత్సరానికి విద్యార్థులను ఆహ్వానించేందుకు పాఠశాల యాజమాన్యాలు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, అమావాస్య రోజున కొత్త కార్యక్రమాలు లేదా చదువులు ప్రారంభించడం శుభకరం కాదనే సంప్రదాయ భావనతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపలేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఈ అమావాస్య ప్రభావం స్పష్టంగా కనిపించింది. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు సగం వరకు మాత్రమే నిండగా, మరికొన్ని చోట్ల హాజరు మరింత తక్కువగా నమోదైంది. దీనివల్ల విద్యార్థులు రాక పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఖాళీగా దర్శనమిచ్చారు. అయితే పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులు వచ్చిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. కొన్ని చోట్ల తిలకం దిద్దడం, చాక్లెట్లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలతో పిల్లలను ఉత్సాహపరిచారు. కొత్తగా చేరిన విద్యార్థులకు పరిచయ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాంల సరఫరా, మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకం అమలుపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, డిజిటల్ తరగతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, అల్పాహార పథకం వంటి ఆకర్షణీయమైన కార్యక్రమాలను అమలు చేస్తుండటంతో, ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని విద్యాశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తొలి రోజు హాజరు తక్కువగా ఉన్నప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మంగళవారం నుంచి పాఠశాలలు మళ్లీ కళకళలాడుతాయని అధికారులు పేర్కొన్నారు.



కానాపూర్‌లో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక స్టూడెంట్ కిట్ల పంపిణీ**

ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థుల కోసం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారరు. ఇందులో కొత్త పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు, షూస్, సాక్స్, బెల్ట్ స్కూల్ బ్యాగులు అందించారు.

**బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్ పథకం పునఃప్రారంభం**

విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రభుత్వం మళ్లీ ఘనంగా ప్రారంభించింది. విద్యార్థులకు ఉదయాన్నే వేడివేడి టిఫిన్, పాలు, రాగిజావ అందించారు.

**ప్రైవేటు స్కూల్ వ్యాన్లపై రవాణా శాఖ ఫోకస్**

స్కూళ్లు తెరుచుకున్న మొదటి రోజే రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ స్కూల్ బస్సులను అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారు.



మరుగుదొడ్లు శుభ్రం చేసిన ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి

**యాలాల :** చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి యాలాల మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. రాష్ట్రంలో ఇంకా పూర్తి స్థాయిలో పాఠశాలల్లో కనీస మౌళిక సదుపాయాలు లేవని తనకు కేంద్రం కెటాయించే ఏడాదికి రూ.5 కోట్ల నుంచి అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండలంలోని గోవా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలతో అంగరంగవైభవంగా ఉంటాయని కొండా గుర్తు చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఎంపి ప్రారంభించారు. అనంతరం ఎంపి కస్తూర్బా పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. బాలికలకు బోజన వసతిపై ఆరా తీశారు. అక్కడ ఏర్పాటు చేసిన బోరు మోటారును ప్రారంభించారు. పాఠశాలకు సహకారాలు అందిస్తానని ఎంపి హామీ ఇచ్చారు. మండలంలోని తూంకుంట, సింగాయిపల్లి, పోతాయిపల్లి, దేవరయాంజాల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల విద్యా అధికారి కమలాకర్‌లు పంపిణీ చేశారు.

తూంకుంటలో విద్యార్థులకు పుస్తకాల కిట్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, | హిర్యానాయక్ తండాలో..







యాలాల మండలంలో భోజన పథకం వసతులను పరిశీలిస్తున్న ఎంపి

# భూసేకరణకు తక్షణ కార్యాచరణ

**లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో మరో ముందడుగు**

**ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ ఆదేశం**

**షాద్‌నగర్, జూన్ 15, ప్రభాతవార్త :** షాద్‌నగర్ ప్రజల తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రయత్నాల్లో మరో కీలక ముందడుగు పడింది. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌ను కలిసి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు తాగునీటి, సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉండటంతో ప్రత్యేక జీవో లేదా అదనపు అనుమతుల అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి భూసేకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుం టానని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు ఏఎంసీ డైరెక్టర్ టి. కర్ణాకర్, తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ పాల్గొన్నారు.



ప్రభుత్వ సలహాదారు ఆదిత్యానాథ్ దాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

అన్ని దరఖాస్తులపైనా

# దృష్టి పెట్టండి

**సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు**

**ప్రజావాణిలో అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన దరకాస్తులను తరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధి కారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తు లను సత్వరమే పరిష్క రించాలని అధికారులకు ఆదేశించారు.

వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమ స్యలు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్‌డిఓ, తహసిల్దార్‌ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని, ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబం ధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవ సాయం, ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వా రా 133 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమ స్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్క రించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్ట ర్‌లు వెంకటాచారి, ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

# మింగేసిన ఇన్‌స్టా మోజు

**ఫొటోల కోసం వెళ్లి మృత్యువాత**

**చెరువులో ఇద్దరు యువకులు మృతి**

**నీటి లోతును గమనించక.. ప్రమాదం**

**కీసర, జూన్15, ప్రభాతవార్త:** సామాజిక మాధ్యమాల్లో లైకులు, కామెంట్ల కోసం చేసే కొన్ని ప్రయత్నాలు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. కేవలం ఇన్‌స్టాగ్రామ్ ఫొటోల కోసం వెళ్లిన ముగ్గురు యువకుల్లో ఇద్దరిని చెరువు రూపంలో ఉన్న మృత్యువు మింగేసింది. అత్యంత విచారకరమైన సంఘటన సోమవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నగరంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన కెవిన్ ఆంటోని (19), జోసెఫ్, వాలెంటైన్ టోనీ (18) అనే ముగ్గురు యువకులు ఇన్‌స్టా ఫొటోలు దిగాలనే ఉద్దేశంతో తిమ్మాయిపల్లి చెరువులోకి దిగారు.

అయితే, నీటి లోతును గమనించకపోవడంతో వారు ప్రమాదంలో చిక్కుకున్నారు. ఈ క్రమంలో కెవిన్ ఆంటోనీ నీటిలో మునిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వారితో ఉన్న జోసెఫ్ అనే యువకుడు ఎలాగోలా సురక్షితంగా బయటపడగలిగాడు. కాగా, మరో యువకుడు వాలెంటైన్ టోనీ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గల్లంతైన యువకుడి కోసం ఆర్‌ఎఫ్ బృందాలు చెరువులో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కళ్లెదుటే స్నేహితులు మునిగిపోవడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. యువత ఫొటోల మోజులో ప్రమాదకరమైన ప్రదేశాల్లో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

# సర్కారు వారి.. స్మార్ట్ స్కూల్

**కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబైన ఆరుట్ల పబ్లిక్ పాఠశాల**

**అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలే లక్ష్యంగా మోడల్ క్లాస్‌రూమ్‌లు, హైటెక్ ల్యాబ్‌లు డిజిటల్ బోధన**

**రేపు ప్రారంభోత్సానికి రానున్న సిఎం రేవంత్**

**భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి, కలెక్టర్**




సిఎం ప్రారంభించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనం

**రంగారెడ్డిఅర్బన్, జూన్ 15, ప్రభాతవార్త :** ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లాలనే తెలంగాణ ప్రభుత్వ దూరదృష్టికి ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రాష్ట్ర విద్యా రంగ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా అంతర్జాతీయ ప్రమాణాల విద్య అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సదుపాయాలు, సాంకేతిక విద్య, డిజిటల్ బోధన, క్రీడా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలతో ఈ పాఠశాలను రూపొందించారు. ప్రారంభోత్సవం నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల కోసం కల్పించిన వసతులపై సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లెర్నింగ్ సెంటర్లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, విద్యార్థుల భోజనశాల, తాగునీటి సదుపాయాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మమేకమై వారి అభ్యాసం, ఆశయాలు, పాఠశాలలో అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో విద్య అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిదర్శనంగా నిలుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలంటే ఆధునిక విద్యతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించే కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. ఈ పాఠశాల ఆ దిశగా ఒక సమగ్ర విద్యా వేదికగా రూపుదిద్దుకుందని తెలిపారు. అదే రోజు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్ అకునూరి మురళి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే వేదిక, ప్రజలు కూర్చునే ప్రాంతాలు, వీఐపీ గ్యాలరీ, మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన స్థలాలు, వాహనాల పార్కింగ్, ప్రవేశనిష్క్రమణ మార్గాలు, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రత్యేక బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళిక, పోలీసు బందోబస్తు, అగ్నిమాపక, వైద్య అత్యవసర సేవల సిద్ధతపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను ఒకే వేదికపై కల్పించారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, హైటెక్ ల్యాబ్‌లు, డిజిటల్ బోధన, కంప్యూటర్ విద్య, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ శిక్షణ, క్రీడా శిక్షణ, కళాసాంస్కృతిక కార్యక్రమాలు, కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షల శిక్షణ వంటి కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయనున్నాయి. విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించడంలో ఈ పాఠశాల కీలక పాత్ర పోషించనుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పాఠశాలపై తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలకు కూడా ఇది ఆదర్శ నమూనాగా నిలుస్తోందన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు కానున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధికి ఆరుట్ల మోడల్ మార్గదర్శకంగా ఉండనుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విద్యాసంస్థ తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థకు కొత్త దిశానిర్దేశం చేయనుంది. నాణ్యమైన విద్య, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విలువలతో కూడిన బోధన ద్వారా గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించే కేంద్రంగా ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఎదగనుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తున్న సిపి, కలెక్టర్





## పందుల బెడదను అరికట్టాలి

**తలకొండపల్లి ఎంపిడిఒకి వినతి పత్రం**

**తలకొండపల్లి ,జూన్15,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలం కేంద్రంలో పందులు, బెడతతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పలుమార్లు పందుల పెంపకం చేస్తున్నటువంటి ఎలకల కుటుంబీకులకు చెప్పిన పట్టించుకోకపోవడంతో సోమవారం తలకొండపల్లి మండల్ ఎంపీడీవో సీతారామమ్మ,కి పందుల బెడత నుంచి తలకొండపల్లి గ్రామ ప్రజలను విష జ్వరాలు చౌకకుండా చూడాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. మండల కేంద్రంలో సుమారుగా వందల సంఖ్యలో ఉన్న పందులను నియంత్రించాలని పందులు పెంపకం చేస్తున్నటువంటి వారికి వెంటనే తలకొండపల్లి గ్రామంలో ఎక్కడ పందుల షెడ్డులు కూల్చివేసి వారి సొంత పొలాలలో ఆరుబయట కి తీసుకువెళ్లాలని తలకొండపల్లి గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఈ వర్షాకాలంలో పందులతో విష జ్వరాలు,మెదడు వ్యాప్ రోగాలు, ఎబోలా వైరస్, లాంటి కొత్తగా పుట్టుకొస్తాయని వీటిని వీలైనంత తొందరలో అరికట్టకపోతే విష జ్వరాలకు గురవుతారని వీటి పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇండ్ల మధ్యలో పందులు తిరగడం వలన దుర్వాసన రావడం జరుగుతుంది. పందుల పెంపకం చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవాంఛ నరసింహ రాజు రెడ్డి, పుట్ట పాండు, తుమ్మ నరసింహ, తిరుపతయ్య, మీసేవ మల్లేష్, పోతుగంటి గణేష్, కటిక వెంకటేష్, పురుషోత్తం, పోతుగంటి సురేష్, బైండ్ల శేఖర్, పోతుగంటి మహేష్,పోతుగంటి కృష్ణ, సుదర్శన్, పోతుగంటి ఉపేందర్, రమేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం

**భావితరాలకు వెలుగునిద్దాం**



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ ,పాలకవర్గసభ్యులు

**నిర్దావెల్లి గ్రామ సర్పంచ్ చేదురువల్లి భాస్కర్ గౌడ్**

**కేశంపేట, జూన్ 15, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని నిర్ధావెల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ మరియు పాలకవర్గసభ్యుల అధ్యక్షతన గ్రామ కిరణాషాప్, తదితర షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న కిరాణా షాప్ యజమానులు, వారితో పాటు ఉన్న తదితర షాపుల యజమానుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. గ్రామంలో షాపుల యజమానులు సమయ పాలన పాటించాలని. గ్రామంలో దుకాణాలు ఉన్న వ్యాపారస్తులు అందరు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, ఉపసర్పంచ్ సఫూరా అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చెన్నయ్య, చంద్రయ్య, రమేష్ నాయక్, రిజ్వానబేగం మోహిజ్, మంజుల జంగేశ్, వెంకటమ్మ మల్లయ్య, వ్యాపారస్తులు అమృతం శేఖర్, గుబ్బ శేకరయ్య, పాషా, డబ్బ రాజు, జాహెద్, రామలింగం, పాలది రమేష్, బషీర్, కండె అంజి, మోహిజ్ , భాస్కర్, శ్రీను, గోపాల్, రామకృష్ణ, లక్ష్మీ మ్నారాయణ, సుదర్శన్, మూస, చంద్రోజి , రాజేందర్, రాజు, నయీం, జంగిర్, వంశీ, మజహర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా వచ్చిన తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ సిబ్బంది

**మోమిన్‌పేట్, జూన్ 15, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలంకు నూతనంగా వచ్చి పదవి బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ మునీరుద్దీన్ ను సోమవారం రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా సాదరస్వాగతంతో కలిసి శాలువాలతో సత్కరించి పూల మాలలు వేసి మిఠాయిలు తినిపించారు. అనంతరం తహశీల్దార్ మునీరుద్దీన్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతు సమస్యలను పెండింగ్లో ఉంచకుండా పారదర్శకంగా సత్వరమే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైనటువంటి కుల, ఆధాయ, నివాస ధృవపత్రాలను సకాలంలో త్వరగా ఇవ్వాలని, రెవెన్యూ సమస్యలపై ఎలాంటి సంధేహాలు లేకుండా ఎవరికి ఏ ఇబ్బంది కలుగ కుండా చూసుకోవాలని, ఏదేని సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయెబ్ తహశీల్దారు సురేష్, ఆర్‌ఐలు సరిత, గోవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ అశ్విని, జూనియర్ అసిస్టెంట్‌లు అలివేలు, మహేష్ గౌడ్, మౌనిక, జీపీవోలు వెంకటపతి, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, కార్యాలయ సిబ్బంది మమత, మంజుల, నర్సింలు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట తహశీల్దారుగా భాధ్యతలు చేపట్టిన మునీరుద్దీన్ తో కార్యాలయ సిబ్బంది.

## అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు

**కోట్‌పల్లి, జూన్ 15, ప్రభాతవార్త;** ఉద్యోగులు అంకితభావంతో పని చేసేన మంచి గుర్తింపు వస్తుందని రైతు అధ్యక్షులు మచ్చెందర్ అన్నారు, సోమవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండ తహశీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్ళిన శ్రీనివాస్, కంప్యూటర్ అపరేటర్ జగదీష్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనందరావును శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు ఉంటుందని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో సిబ్బంది, బాల్‌రాజ్, కంప్యూటర్ అపరేటర్ సాయి,రమేష్, సతీష్, లవకుమార్, జగ్గు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు,



బదిలీపై వెళ్ళిన తహశీల్దార్, శ్రీనివాస్, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ అనందరావును సన్మానిస్తున్న రైతు అధ్యక్షులు మచ్చెందర్.

# యుద్ధ ప్రాతిపదికన డంపింగ్ యార్డును తొలగించాలి



**జవహర్‌నగర్, జూన్ 15, ప్రభాత వార్త:** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నజవహర్‌నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును యుద్ధ ప్రాతిపదికన వెంటనే తొలగించాలని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డికి కమిటీప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.జేఏసీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, గద్దం సదానందం, తోటపల్లి శంకర్, టి. శివన్నారాయణ, బద్రగామి ఆంజినేయులు, వై. మల్లేష్, ఎం. శ్రీనివాస్, చంద్రమౌళి, డి. జాన్, ప్రతాప్, నర్సింగరావు, అల్లూరి సావిత్రి, పెర్క సునీత, వి. ప్రవీణ్, మహ్మద్ రషీద్ ద్రావిడ, మేడశీను, శ్రావణ్ కుమార్, మోనార్క్ దుర్గాప్రసాద్, కొన్నెవేణు, సిహెచ్ మాధవరెడ్డి, రాంపల్లి అశోక్ కుమార్, పి. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు చుట్టుపక్కల ఉన్న జవహర్‌నగర్, కాప్రా, యాప్రాల్, కీసర, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాలి, నీరు, నేల కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.గత ఎన్నికల సమయంలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారంపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని వారు కోరారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును పరిరక్షి ంచాలని డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డును వెంటనే తొలగించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తామని పోరాట కమిటీ హెచ్చరించింది.

# ప్రజాస్వామ్య రక్షణ మన బాధ్యత

**.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కడ్తాల్, జూన్ 15, ప్రభత వార్త :** కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో ఫంక్షన్ హాల్‌లో కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బూతు లెవల్ ఏజెంట్2 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అవగాహన శిక్షణ తరగతులు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి అధికార ప్రతినిధి గౌరీసతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు టిపిసిసి అధికార ప్రతినిధి గౌరీసతీష్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మరియు పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ మరియు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మరియు ఎన్నికల సంఘం కలిసి దేశవ్యాప్తంగా ఓట్ల దొంగ తనానికి పాల్పడుతున్నాయని, కాంగ్రెస్ ఓటర్ల ఓట్లను అక్రమంగా తొలగించే కుట్ర చేస్తున్నాయని తీవ్రంగా ఆరోపించారు. ఈ అక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రాధాన్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు బూత్ లెవెల్ ఏజెంట్లకు వివరిస్తూ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను, ఇంటింటి సర్వేను నిశితంగా పరిశీలించాలని, ఏ ఒక్కరి ఓటు తొలగింపునకు గురికాకుండా చూడాలని పేర్కొన్నారు. ఒకవేళ అధికార యంత్రాంగం ద్వారా ఎవరి ఓటైనా తొలగింపబడితే, వెంటనే స్పందించి సరైన ఆధారాలతో తిరిగి ఓటు హక్కును పునరుద్ధరించేందుకు దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. ఓటు హక్కు అనేది ప్రజా స్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధం.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అక్రమాలకు తావులేకుండా చూడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, ఒకే పేరుతో ఉన్న బహుళ ఓట్లను, మరణించిన వారి పేర్లను, ఊర్లో లేని వారి ఓట్లను గుర్తించి జాబితా నుంచి తొలగించేలా స్థానిక అధికారులతో బూతు లెవల్ ఆఫీసర్లతో కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకుడిని కొత్త ఓటరుగా నమోదు చేయించేలా బూత్ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. బూత్ గెలిస్తేనే పార్టీ గెలుస్తుందని, ఎన్నికల్లో విజయం అనేది బూత్ స్థాయి పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని బూత్ లెవెల్ ఏజెంట్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్రోడీకరించుకోవాలని దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడాలని పార్టీ నాయకత్వం గట్టిగా

## ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

**కుల్కచర్ల,జూన్ 15, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం ప్రారంభిండం హర్షనియమని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక నాయకులుతో కలిసి అల్పాహారం ప్రారంభిచారు.ఈ సందర్భంగా



అల్పాహారం ప్రారంభిస్తున్న సర్పంచ్

సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో అల్పాహార(బ్రేక్‌ఫాస్ట్) పథకం ప్రారంభించారని ప్రభుత్వ పాఠశాలలోనాణ్యమైన విద్యతో పాటు అని సౌకర్యాలు అందజేస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ శ్రీలత జంగయ్య, ఉప సర్పంచ్ శాంత మొగులయ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి,ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య, కెబి రాజు, జి, రమేష్‌వార్డు సభ్యులు శ్రీలత శ్రీశైలం,లక్ష్మి ఆనంద్,కిష్టమ్మ,వెంకటమ్మ, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓబి పనులను వెంటనే పూర్తి చేయాలి

**ఘట్‌కేసర్, జూన్ 15, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు–ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి వద్ద సోమవారం ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో



బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

ఆర్‌ఓబి పూర్తి చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డితో పాటు నాయకులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వంతెన పనుల ప్రగతిపై సుదర్శన్‌రెడ్డి కాంట్రాక్టర్ సత్తిరెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అధికార కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇదిగో నిధులు, అదిగో పనులు అంటూ ప్రజలను మధ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వంతెన పూర్తి కాకముందే నిధులు వచ్చాయనఇ సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేశారని ఆర్‌ఓబికి సంబంధించి ఇంకా 20 శాతం బిల్లులు ప్రభుత్వం నుంచి ఇంకా విడుదల కాలేదని వంతెన పూర్తి కోసం మరో రూ.6 కోట్లు అవసరమని తెలిసిందన్నారు. కాంగ్రెస్ నాయకులు 4 కోట్లు వస్తే పనులు పూర్తవుతాయని అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంపై రాజకీయాలు చేయడం బాధ్యతారాహిత్యమని దుయ్యబట్టారు. ఘట్‌కేసర్‌లో ఆర్‌ఓబి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడమే లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు పనిచేయాలని ప్రజాసమస్యలపై అవసరమైతే ఉద్యమించి మరింత ఉదృతం చేయడానికి వెనుకడబోమని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షులు పడిగెం వీరేశం, పసులాది చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఓబిసి మోర్చ అధ్యక్షులు దాసరి బాలనర్సింహ్మా, కిసాన్‌మోర్చ అధ్యక్షులు కట్ట మధుసూధన్‌రెడ్డి, నాయకులు సురుపు అనిల్‌గౌడ్, బండ్లగూడెం కిషోర్‌కుమార్‌గౌడ్, లంబ పవన్‌యాదవ్, బూత్ అధ్యక్షులు మమతశర్మ, శ్యామ్‌రెడ్డి, సాయిగౌడ్, తేజావత్ సుధీర్‌రెడ్డి, కళ్లెం మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు ఉత్పత్తిదారుల సమైక్య నూతన కార్యవర్గం

## రైతు ఉత్పత్తిదారుల సర్వ సభ్య సమావేశం

**యాచారం, జూన్15, ప్రభాతవార్త:** యాచారం మండల పరిషత్ కార్యాలయంలోని ఇందిరా క్రాంతి పథకం మహిళా సమైక్య ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తుదారుల సర్వసభ సమావేశం ఎంపీడీవో రాధా రాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రైతు ఉత్పత్తుల సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. రైతులు పండించిన పంటలు మద్దతు ధరకు అమ్ముకునే విధంగా రైతు ఉత్పత్తుదారుల సమైక్య ఉపయోగపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం నరసింహ, ఎపిఎం శ్రీనివాస్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ప్రేమలేఖ సిసిలు, పిజిలు తదితరులు పాల్గొన్నారు.

## మండల ఉపసర్పంచుల సంఘం కార్యవర్గం ఎన్నిక

**యాచారం, జూన్15, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్ల సంఘం ఏర్పాటుకు సోమవారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గున్ గల్ ఉపసర్పంచి మచ్చ అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా తక్కలపల్లి తండ ఇస్లావత్ రాజు, ప్రధాన కార్యదర్శిగా మేడిపల్లి దెంది మధుకర్ రెడ్డి, జాయింట్ కార్యదర్శిగా ధర్మన్నగూడ గౌర నాగరాజు, ట్రెజరర్‌గా మల్కేజీ గూడా రెడ్డి మోని శిరీష, కార్యనిర్మాణ సభ్యులుగా యాచారం కుమ్మరిగూడెం మంగ కృష్ణ, గడ్డ మల్లయ్య గూడ లక్ష్మణ్, చింతుల్ల నాయిని శ్రీకాంత్, కొత్తపల్లి అనిత రమేష్, మాల్ మల్లమ్మ, తక్కలపల్లి సువర్ణ వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుమచ్చ అనీల్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో విశ్వాస ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు పెద్దలందరికీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

## ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15, ప్రభాతవార్త:** ప్రజావాణిలో అందిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారుల నుంచి డిఆర్ఓ మాలతీతో కలిసి అదనపు కలెక్టర్ 95 ధరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఏసీ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మనవద్దకు వస్తారని వారి నమ్మకాన్ని నిలమెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలనని జాప్యం లేకుండా చూడాలని తిరస్కరిస్తే దరఖాస్తులను కల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. తీసుకున్న ధరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదదనపు కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి





పోచారం డివిజన్ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో ప్రపంచ వృద్ధుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రంగయ్య తదితరులు.

## వృద్ధులను గౌరవించండి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15, ప్రభాత వార్త:** వృద్ధులను గౌరవించడం సమాజ బాధ్యతయని డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట రంగయ్య అన్నారు. పోచారం డివిజన్ కొర్రెముల పరిధిలోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సోమవారం ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వృద్ధులపై జరుగుతున్న శారీరక, మానసిక ఆర్థిక సామాజిక దుర్వినియోగాలను ఆరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని అన్నారు. వృద్ధులు కుటుంబాలకు, సమాజానికి అమూల్యమైన సంపదయని వారి అనుభావాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవాన్ని జూన్ 15న నిర్వహించడం ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి భద్రత, సంక్షేమంపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సభ్యులు వెంకటేశ్వర్లు, ఇన్నారెడ్డి, యాదిరెడ్డి, ముత్యాల్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, కృష్ణమూర్తి, టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. మన్యం, సభ్యులు రాజనర్సు, లక్ష్మీనారాయణ, బీరయ్య, కొట్టే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో**

## చర్మవ్యాధులపై అవగాహన సదస్సు

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీ, నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చర్మవ్యాధులు, సుఖవ్యాధులు, కుష్టు వ్యాధుల విభాగం ఆధ్వర్యంలో ఎస్టీఐ, హెచ్‌ఐవీలపై క్లినికల్ అవగాహన సదస్సు జరిగింది. నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న మార్గదర్శకత్వంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కుష్టు వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుమంత్, అక్షిత, పిజీ విద్యార్థులు జ్యోత్స్న, రియా, శ్రీయ, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో గల మ్యూటేషన్ ప్రక్రియ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీలో విలీనమైన గ్రామాల్లోని గ్రామ కంఠం స్థలాలకు ఇంటి నెంబర్లు, మ్యూటేషన్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.వినోద్ సోమవారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీలో ఇటీవల విలీనమైన 11 గ్రామాల ప్రజలకు గ్రామ కంఠం కింద స్థలాలకు ఇంటి నెంబర్లు, విద్యుత్ మీటర్లు రావడం లేదని అన్నారు. కొన్ని ఇండ్లకు తండ్రుల పేరున పన్ను విధిస్తున్నందున వారసులకు మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మ్యూటేషన్ జరుగకపోవడం వలన ప్రజల ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు, బ్యాంకు రుణాలు, భవన నిర్మాణ అనుమతులు ఇతర ప్రభుత్వ సేవలు పొందడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇకనైన సంబంధిత అధికారులు మ్యూటేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ డీసీకి వినతి పత్రం అందజేశారు.

## కొత్త యాప్ ద్వారానే రైతులు ఎరువులు కొనుగోలు చేయాలి

**..మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ**

**శామీర్‌పేట, జూన్ 15, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త ఫర్టిలైజర్ యాప్ పై డీలర్స్ నుంచి



అలియాబాద్ రైతువేదికలో రైతులకు, ఫర్టిలైజర్ డీలర్స్‌కు కొత్త యాప్ ద్వారా ఎరువుల కొనుగోలు చేయటానికి అవగాహన కల్పించిన మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, పాల్గొన్న మండల ఏఓ రమేశ్, రైతుల తదితరుల దృశ్యం

రైతులు ఎరువులు కొనుగోలు (పొందాలని) చేయాలని మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ రైతులకు సూచించారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ రైతు వేదికలో కొత్తగా వచ్చిన ఫర్టిలైజర్ యాప్‌పై రైతులకు, డీలర్లకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ జరిగిన అవగాహన సమావేశంలో మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ ప్రతి రైతు కూడ ఈ సీజన్‌లో కొత్త యాప్ ద్వారానే అన్ని రకాల ఎరువులను పొందాలని సూచించారు. డీలర్లు యాప్ ద్వారానే రైతులకు ఎరువులను అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సుధీర్‌కుమార్, శ్రీనాథ్, జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు,మండల రైతు ముద్దం సంజీవరెడ్డి, రైతులు జగన్మోహన్‌రెడ్డి, సుదాకర్‌రెడ్డి, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నల్లవెల్లిలో విద్యుత్ అంతరాయం

**యాచారం, జూన్ 15, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సుధీర్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రకటన తెలుపుతూ.. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రైతులు చిన్న సన్న వ్యాపారాలు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని సూచన చేశారు. విద్యుత్ అంతరాయానికి అందరూ సహకరించాలని కోరారు.

## వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలకు ఆదేశాలు

**జీడిమెట్ల, జూన్ 15, ప్రభాతవార్త:** గాజులరామారం సర్కిల్ పరిధిలోని చంద్రగిరి నగర్‌లో శాశ్వతంగా తొలగించిన గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ) ప్రాంతాన్ని జోనల్ కమిషనర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా గతంలో చెత్త పేరుకుపోయే ప్రాంతాన్ని పూర్తిగా చెత్త రహితంగా మార్చి, కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన స్థానిక ప్రజలను జోనల్ కమిషనర్ అభినందించి సత్కరించారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత కార్యక్రమాలు విజయవంతమవు తాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం కైలాష్ హిల్స్, మల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలోని నీటి నిల్వ సమస్యలు ఏర్పడే ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హైడ్రా సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని, గాజులరామారం పరిధిలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా అదనపు మోటార్ పంపులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఓ శంకర్‌నాయక్

## కొడంగల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

**- విద్యార్థినిలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**- డిఐఓ శంకర్‌నాయక్**

**కొడంగల్, జూన్ 15, ప్రభాతవార్త:**

కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల అవరణలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రేపటి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభం కానున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఓ) శంకర్‌నాయక్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్దినిలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కళాశాలలో జనరల్ కోర్సులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు వోకేషనల్ కోర్సులు ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యు తదితర కోర్సుల్లో అసక్తి కలిగి ఉన్న విద్యార్దినిలు ప్రవేశాలు పొందవచ్చన్నారు. కొడంగల్ నియోజకవర్గ బాలికల ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రత్యేకంగా బాలికల జూనియర్ కళాశాలను మంజూరీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కళాశాల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేసిన కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు కావడం పట్ల గ్రామీణ ప్రాంతాల పేద బాలికలకు ఎంతో మేలు జరుగుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు. రేపటి నుండి కళాశాల తరగతులు, ప్రవేశాల ప్రక్రియ స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల వేదికగా కొనసాగుతుందని, అర్హులైన విద్యార్దినిలు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో వచ్చి పర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## నూతన తహాశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

**కోట్‌పల్లి, జూన్ 15, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల నూతన తహాశీల్దార్‌గా అనందరావు సోమవారం నాడు కోట్‌పల్లి తహాశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహాశీల్దార్ శ్రీనివాస్ వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాని బదిలీపై వెళ్ళాడు అక్కడే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పని చేసిన అనందరావును కోట్‌పల్లి తహాశీల్దార్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలను అందిస్తామని వారు పేర్కొన్నారు.

## కిరణా షాపులలో పోలీసులు తనిఖీలు

**-నిషేదిత గుట్కా,స్వాధీనం పలువురిపై కేసులు నమోదు**




తనిఖీలు చేస్తున్న పోలీసులు

**రంగారెడ్డి అర్బన్ జూన్15, ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని గుట్కా విక్రేతలపై పోలీసుల ఉక్కుపాదం మోపారు. సోమవారం శంషాబాద్ మండలంలోని కవేలిగూడ, పాలమాకుల, ముచ్చింతల గ్రామాలోని కిరాణా దుకాణాల్లో ఈగల్స్ టీమ్, నార్కోటిక్ డ్రగ్స్ టీమ్ సంయుక్తంగా గంజా, నిషేధిత టొబాకో ఉత్పత్తులు, మాదకద్రవ్యాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా కవేలిగూడ గ్రామంలోని ఎస్‌కే పాన్ షాప్ మరియు తవక్కల్ పాన్ షాప్లో నిషేధిత టొబాకో ఉత్పత్తులు, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత గుట్కా, టొబాకో ఉత్పత్తులను విక్రయిస్తున్న సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నిషేధిత మత్తు పదార్థాలు, గుట్కా వంటి ఉత్పత్తుల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. అక్రమ గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ప్రజా సేవలో మరింత రాణించాలి



వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, జూన్ 15, ప్రభాతవార్త :** షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ పి. రఘు నాయక్ గారి జన్మదినం సందర్బంగా ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జాంగారి రవి తదితరులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పి. రఘు నాయక్ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేస్తున్న సేవలను నాయకులు కొనియాడారు.

## నేడు కరంట్ బంద్

**మేడ్చల్, జూన్ 15, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ నగర్ ఫీడర్ ఏరియాలో నేడు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ గుండ్లపోచంపల్లి ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీనగర్ ఫీడర్‌లోని విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందును లక్ష్మీనగర్, మానిక్‌రెడ్డి నగర్, ఊర్జితా విల్లాస్, సంజన అపార్ట్ మెంట్స్, ప్రైమస్ ఎప్సిలాన్స్, ప్రెస్టేజ్ పార్క్ ప్రాంతాల్లో నేడు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కరంట్ ఉండదని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ

**శామీర్‌పేట, జూన్ 15, ప్రభాతవార్త:**

శామీర్‌పేట మండలంలోని తూంకుంట, సింగాయిపల్లి, పోతాయిపల్లి, దేవరయాంజాల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల విద్యా అధికారి కమలాకర్‌లు పాల్గొని పంపిణీ చేశారు. సోమవారం శామీర్‌పేట మండల పరిధిలోని తూంకుంట, సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. అదే విధంగ దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారితో పాటు టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి కూడ పాల్గొని పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యను పొందాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతో పలు సౌకర్యాలు కల్పిస్తుందని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. విద్యతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, ఎంఇఓ కమలాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కట్ట మీనాకుమారి, మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి




దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, ఎంఇఓ కమలాకర్,తదితరుల దృశ్యం

మధుసూదన్‌రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలేశ్, వెంకట్‌రెడ్డి, శేఖర్, వెంకట్రామరెడ్డి, కల్యాణి, సంధ్యారాణి, రామాలయ మాజీ చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ, మాజీ ధర్మకర్తలు జి.హరికృష్ణ, పి.నర్సింహ్మారెడినడ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బి.నాగమణి, బి.జనార్ధన్‌రెడ్డి, పి.ధర్మారెడ్డి, ఆర్.శ్రీనివాస్‌యాదవ్, చీరాల యాదగిరి, టిఆర్ రవీందర్‌గౌడ్, ఎండి జాఫర్, చింతల నర్సింహ్మారెడ్డి, తిగుళ్ల మురళిగౌడ్, కత్తి రమేశ్, నాయకులు తిగుళ్ల దర్శన్‌గౌడ్, చింతల బల్వంత్‌రెడ్డి, ఎం.సాయికుమార్, భాస్కర్, హసన్, అలీ, పి.రోహిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తుమ్మ చెరువును అభివృద్ధి చేసి భూగర్భ జలాలు పెరిగేలా చెయ్యండి



మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**మేడ్చల్, జూన్ 15. ప్రభాతవార్త :**

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మ చెరువు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి భూగర్భ జలాలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అదే విధంగా హౌసింగ్ బోర్డు కాలనీ నుండి లైబ్రరీ వరకు నూతన రోడ్డు తక్షణమే వేయాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ తుమ్మ చెరువులో పూడిక తెయిస్తే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని అలాగే డ్రైనేజ్ కలవకుండా చూడాలని, నూతన లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. మేడ్చల్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకు, మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు వెళ్ళే ప్రధాన రోడ్డులో హౌసింగ్ బోర్డు కాలనీ నుండి లైబ్రరీ వరకు వెంటనే నూతన రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీ.జె.వై.ఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ దాస్, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర్ రెడ్డి, కార్యదర్శులు సురేందర్ రెడ్డి, విష్ణు, నాయకులు థాత్రిక లక్ష్మణ్ వంజరి, పాతూరి సుధాకర్ రెడ్డి, కవి రాజు, భరత్ వంజరి, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, బొజ్జ వంశీ రెడ్డి, శ్రీపాల్, మామిళ్ళ నర్సింగ్ రావు, ఎన్.ఎస్.గౌడ్, బాబు గౌడ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద చెరువుకు మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేస్తాం

**దౌల్తాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు సంబంధించిన తూమును ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారంరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ గడ్డం శ్రీనివాస్, ఏఈ వంశీకృష్ణలు చెరువు వద్దకు చేరుకుని తూము పరిస్థితిని, దానికి అవసరమైన రిపేర్ పనులను నిశితంగా పరిశీలించారు. ఈ సంధర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తూముకు సంబంధించిన మరమ్మత్తు పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి, యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేస్తామని అన్నారు. నీటి వృధాను అరికట్టడానికి ఈ మరమ్మత్తులు అత్యంత అవసరమని వారు పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



పెద్ద చెరువు తూమును పరిశీలిస్తున్న అధికారులు,సర్పంచ్

# రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థను మెరుగు దిద్దుతున్నాం

- **గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను ధ్వంసం చేశారు**
- **రాష్ట్రంలో నూతనంగా 200 పబ్లిక్ స్కూల్ ఏర్పాటు**
- **విద్యా వ్యవస్థ మార్పుకు ప్రతి ఒక్కరు సహకరించాలి**
- **వెల్జల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శన**
- **రాష్ట్ర విద్య కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్**



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యా కమిషన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు

**తలకొండపల్లి జూన్ 15, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో అప్పటి బి ఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో విద్యా వ్యవస్థను మొత్తం ధ్వంసం చేసిందని, విద్యా వ్యవస్థపై ఏ ఒక్కరికి న్యాయం చేయలేదని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేష్ అన్నారు. సోమవారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల పున: ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు.

గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుంచి "ప్రభుత్వ పాఠశాలలు ముద్దు ప్రైవేటు పాఠశాలలు వద్దు" అనే నినాదంతో విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు అందరితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటంతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీం సుల్తానా బేగం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 3000 పైచిలుకు పాఠశాలలు స్కూలు ఇంటర్ ,పాలిటెక్నిక్ ,కస్తూర్బా గాంధీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఎస్సీ , ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళల గురుకుల పాఠశాలలు ఉన్నాయని వాటన్నిటిని సక్రమమైన పద్ధతిలో తీర్చిదిద్దేందుకు విద్యా కమిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నాన్చి వేసిందని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఉపాధ్యాయులకు కావలసిన ట్రాన్స్‌ఫర్లు, వారి సమస్యలను పరిష్కారం కొరకు కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉన్న 317 జీవోను సవరణ చేశామని ఆయన తెలియచెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలందరూ నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ కులాలకు చెందిన వారే ఉన్నారని, వారందరినీ భవిష్యత్తులో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని, వారందరి పిల్లల మార్పు కోసం విద్యా కమిషన్ ఆధ్వర్యంలో సమూల మార్పులకు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు సుమారు 1000 కోట్ల రూపాయలతో పుస్తకాలు, నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు ,బెల్టు, రెండు జతల బట్టలు అందరికీ మంజూరి చేసి పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో నూతనంగా పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రంలో నాగర్ కర్నూల్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి, రంగారెడ్డి జిల్లాలోని మంచాల, ఆరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా ఎంపిక చేసి పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ పబ్లిక్ స్కూల్ నిర్వాహనకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 15 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని, వీటి ద్వారా



విద్య కమిషన్ సభ్యులు చార కొండ వెంకటేష్

వచ్చే ఫలితాలతో రాష్ట్రం మొత్తంలో అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో నూతనంగా 200 పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన వివరించారు. రంగారెడ్డి జిల్లాలో తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ , నాగర్ కర్నూల్ జిల్లాలోని వెల్దండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఈ సంవత్సరం తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ స్కూల్ ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, నిరుపేద ప్రజలు ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల భారం మోయకుండా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ద నున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులంటే సమాజం లో చెడ్డ పేరు వచ్చే విధంగా అప్పటి ప్రభుత్వాలు క్రియేట్ చేశాయని, ఒకరిద్దరిని చూయించి ఉపాధ్యాయ సమాజాన్ని నిందించడం సమంజసం కాదన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఎంతో మంచి పేరుతో తమ విధులు నిర్వ హిస్తున్నారని, రంగారెడ్డి జిల్లాలోని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో చదివే విద్యార్థులు ప్రైవేట్ కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నా రన్నారు. అక్కడి ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఫలితాలు వస్తున్నాయని ఆయన తెలియజేశారు. వెల్జల్ గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు విశాలమైన స్థలం ఉండడం, ఇక్కడి ప్రజలందరూ ఐక్యమత్యంతో ఉండి పాఠశాలకు అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీమా సుల్తానా బేగం, అనిత, గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ, ఉప సర్పంచ్ విజయలక్ష్మి ్మ, మాజీ ఎంపీపీసీఎల్ శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాసమూర్తి, అంబాజీ, అజీజ్, సర్పంచులు భారతమ్మ గోపాల్, సుధాకర్, నాయకులు ముజఫర్ రహమాన్, వాన రాశి వెంకటేష్, రమేష్ యాదవ్, డేవిడ్, సదానందం గౌడ్, ఆరిఫ్, అశోక్ , విష్ణు తో పాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్మానం

**తలకొండపల్లి జూన్ 15, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధి వెల్జల్ లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు అధిక మార్కులు సాధించడంతో ఆ విద్యార్థులకు విద్య కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేష్ ఘనంగా శాలువా బొకేతో ఘన సన్మానం చేసి 1116 నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.






పిల్లలకు ఆర్గానిక్ సబ్బులు పంపిణీ చేస్తున్న ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## పరిశుభ్రతపై ప్రజలు దృష్టి సారించాలి

**యాలాల జూన్ 15, ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతోందని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవితాన్ని గడపాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఎంపి కొండా యాలాల మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. జెస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 516 వాహనాలను ఏర్పాటు చేసి క్లీన్ అండ్ గ్రీన్ చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొండా సోమవారం యాలాల పాఠశాలలో మరుగుదొడ్ల క్లీన్ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనులు చేస్తాయని నిర్వాహణ మాత్రం అంతంతమాత్రంగానే ఉంటుందని తెలిపారు. అందుకు గాను ప్రజలు నిర్వాహణలో పాలుపంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యాలాల మాజీ ఎంపిపి తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా, బిజెపి నాయకులు యు,రమేష్‌కుమార్, ఎమ్మార్వో, ఎంపిడిఒ, ఎంఇఒ, పాఠశాలల సిబ్బంది, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పాఠశాలలోని నాణ్యమైన విద్య

**సర్పంచ్ చంద్రపాల్ రావు**



ముజాహిద్‌పూర్‌లో పుస్తకాలు పంపిణి చేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల, జూన్ 15, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలతో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ చంద్రపాల్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలోస్థానిక నాయకులతో కలిసి విద్యార్థులకు నోట్ బుక్కులు ,పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రవేటుకు దిటుగా ప్రభుత్వ బడులో విద్య జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోల్ల భవాని భీమయ్య, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కమార్, వార్డు సభ్యులు బాస్కర్, బాల్‌రాజ్, వెంకట్, అంబదాస్, తదితరులు పాల్గొన్నారు.

**ఇప్పాయిపల్లి లో.....**

**నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం.....**

**మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు**

ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలోస్థానిక నాయకులతో కలిసి విద్యార్థులకు నోట్ బుక్కులు, పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ... విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు నోటుబుక్కులు సన్నబియ్యంతో భోజనం నిర్వహించడంతో పోటు క్రీడారంగాంలో తీర్చుద్దుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్య, గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**హిర్యానాయక్ తాండ గ్రామ పంచాయతీలో....**

**విద్యర్థులకు నోట్ బుక్స్ అందజేత**

ప్రభుత్వ పాఠశాలతో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ సేవాలమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిర్యానాయక్ తాండ గ్రామ పంచాయతీ ప్రభుత్వ పాఠశాల విద్యర్థులకు

స్థానిక నాయకులతో కలిసి విద్యార్థులకు నోట్ బుక్కులు, పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టిసారించిదని అని సౌకర్యాలు కల్పించి విద్యార్థువిద్యభివృద్దికిఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాము నాయక్, ఉపాధ్యాయులు దేవుల నాయక్, గ్రామ నాయకులు రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## యువ కార్యకర్తల సమావేశాలను జయప్రదం చేయండి

**షాద్‌నగర్, జూన్ 15, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ




గోడ పత్రికను విడుదల చేస్తున్న కమ్యూనిస్టు నాయకులు

(మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృత సమావేశాలు జూన్ 16, 17 తేదీలలో రంగారెడ్డి జిల్లా కొత్తపేట్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్. రాజు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతం నుంచి యువత, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలో యువ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎన్. రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత, కుల విద్వేషాలను రెచ్చగొడుతూ అప్రజాస్వామిక రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు.

ప్రజాస్వామ్య రాజ్యాంగ విలువలను బలహీనపరిచి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు భారీ పన్ను రాయితీలు కల్పిస్తూనే, జీఎస్టీ, సెస్సుల పేరుతో సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపుతున్నారని ఆరోపించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత సమస్యలు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నాయని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో డిండి శివన్నగూడ ప్రాజెక్టు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సీలింగ్ భూములు, పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, త్రిబుల్ ఆర్ రోడ్డు, ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు, ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించాలని, మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ యువ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ టౌన్ కార్యదర్శి శ్రీను నాయక్, కొత్తూరు మండల కార్యదర్శి బిసా సాయిబాబు, నందిగామ మండల కార్యదర్శి కొంగరి నర్సింహులు, టౌన్ నాయకులు కే. రాజు, ముఖిత్, ఎస్ఎఫ్ఐ నాయకులు, సీఐటీయూ సభ్యుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.